ప్రజాశక్తి

మంగళవారం 28 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రైతు బజార్లలో సేంద్రీయ దుకాణాలు

- స్థలాలు సరిపోక రైతుల అవస్థలు
- కొత్త స్టాల్స్ ఏర్పాటుపై చూపని శ్రద్ధ



ఎంవిపి రైతు బజార్ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రయివేటు సేంద్రీయ దుకాణం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సేంద్రీయ పంటల పేర రైతు బజార్లలో ప్రయివేటు వ్యక్తులకు ప్రవేశం కల్పించి, చిన్నచిన్న రైతులను రాబోయే కాలంలో బయటకు నెట్టే ప్రయత్నం ప్రభుత్వం బలంగా చేస్తోంది. ఏపిసిఎన్ఎఫ్ రైతు సాధికార సంస్థ సౌజన్యంతో సేంద్రీయ ఉత్పత్తుల దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. నామమాత్రపు అద్దెకు రైతు బజార్లలో షాపులు పెట్టుకొని కూరగాయలు, ఆకుకూరలు సహా ఇతర ఆహార పంటలు విక్రయించుకునేందుకు స్థలాలు కేటాయించింది. చిన్న రైతులు పండించే కూరగాయలు, ఆకుకూరలకు కనీస ధర కల్పించడం, వినియోగదారునికి సరసమైన ధరకు అవి లభించేలా చూసేందుకు గత ప్రభుత్వాలు రైతు బజార్లను ఏర్పాటుచేసి ప్రోత్సహించాయి. ప్రస్తుతం రైతు బజార్లను ఆదాయ వనరుగా, వ్యాపార కేంద్రాలుగా ప్రభుత్వం తయారుచేయనారంభించింది. రైతు బజార్లు ఆరంభంలో రూ.300 అద్దె వుండగా, ఇప్పుడది రూ.3600కు పెరిగింది. సేంద్రీయ పంటలు, కూరగాయల పేరుతో రైతు బజార్లలోకి ప్రవేశించిన ప్రయివేటు షాపులు విక్రయిస్తున్న కూరగాయలు సేంద్రీయ పంటలో, కాదో తెలీదు కానీ, దశాబ్దాలుగా రైతు బజార్లకు పొలాల్లో పండించిన కూరగాయలు తెచ్చుకొని అమ్ముకున్న రైతులు మాత్రం ఇబ్బందులుపడుతున్నారు.

కొద్ది రోజుల క్రితం సీతమ్మధార రైతుబజార్‌లో ఏర్పాటుచేసిన సేంద్రీయ దుకాణంతో 15 మంది రైతులకుపైగా కూరగాయలు అమ్ముకునే స్థలం లేకుండాపోయింది. భవిష్యత్తులో రైతు బజార్లను ఎత్తేసి ఆ స్థలాలను ప్రయివేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా సేంద్రీయ పంటల దుకాణాలకు రైతు బజార్లలో అనుమతులివ్వడం, రైతులు, డ్వాక్రా, హోల్‌సేల్, కమర్షియల్ స్టాల్స్‌కు అద్దె పెంచేపనికి శ్రీకారం చుట్టింది. రైతు బజార్ల నిర్వహణ నుంచి పూర్తిగా ప్రభుత్వం తప్పుకొని, వాటి నిర్వహణ, ఇతర అవసరాలకు రైతు బజార్ల నుంచి ఆదాయ వనరుగా మార్చింది. ఎంవిపి కాలనీ, సీతమ్మధార, మధురవాడ, పెదవాల్తేరు, నర్సింహనగర్, కంచరపాలెం, మర్రిపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ, ములగాడ, స్టీల్‌ప్లాంట్‌లో రైతుబజార్లు ఉన్నాయి. వీటిలో సీతమ్మధార, ఎంవిపికాలనీ, గోపాలపట్నం, కంచరపాలెం రైతు బజార్లలో సేంద్రీయ షాపులు ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలోని అన్ని రైతు బజార్లలో క్రమంగా ప్రయివేటు వ్యక్తుల జోక్యం పెంచి, రైతు బజార్లలో గిట్టుబాటు రాని పరిస్థితిని రైతులకు కల్పించనుంది. గుర్తించిన 1823 మంది

మిగతా 2లో..

జి-20 సదస్సుకు సర్వం సిద్ధం


విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున



జి-20 లోగోతో కూడిన డెకరేషన్..

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖలో ఈ నెల 27, 28 తేదీల్లో జి-20 సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తిఅయ్యాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. సోమవారం ఆయన జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు, పోలీసు కమిషనర్ శ్రీకాంత్‌తో కలసి విశాఖ ఎయిర్ పోర్టు నుంచి ఎన్ఎడి, మురళీనగర్, 24X7 తాగు నీరు ప్రాజెక్టు, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లై-ఓవర్, సిరిపురం, ఎయు బస్ స్టాప్, స్మార్ట్ సిటీ ఉడా పార్కు, సీతకొండ వ్యూ పాయింట్, గుడ్లవానిపాలెం, సాగర్ నగర్, ర్యాడిసన్ బ్లూ హోటల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నగరానికి విచ్చేయుచున్న దేశవిదేశీయుల ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, వచ్చిన అతిథులకు లైజనింగ్ అఫీసర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వారు ప్రయాణించే మార్గంలో సుందరీకరణ పనులు, రోడ్లు, విద్యుత్‌ను జివిఎంసి కమిషనర్ ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. భద్రతా ఏర్పాట్లను పోలీసు కమిషనర్ పూర్తి స్థాయిలో సమీక్షిస్తునారని తెలిపారు.

జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ, అతిథులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, నగరానికి వచ్చే అతిథులకు 2500 మంది పోలీసులతో భద్రత ఏర్పాటుచేశామని తెలిపారు.



నగరంలో విద్యుత్ కాంతుల ఏర్పాటు

పరిశ్రమల స్థాపనకు 21 రోజుల్లోనే భూ కేటాయింపులు : అమర్‌నాథ్

▶ వార్త మెయిన్‌లో..

ఉక్కు అమ్మకాన్ని నిలిపివేస్తూ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి

▶ వార్త మెయిన్‌లో..

ఐఇడి బాంబు పేలి జవాను మృతి

▶ వార్త మెయిన్‌లో..



అక్కయ్యపాలెంలో స్లమ్ ఏరియా కనిపించకుండా కర్టెన్లు కడుతున్న జివిఎంసి సిబ్బంది

'స్లమ్' కనిపించకుండా కర్టెన్లు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జి-20 సదస్సుకు విశాఖ వస్తున్న ప్రతినిధులకు స్లమ్ ఏరియా కనిపించకుండా అధికారులు మేకప్ చేస్తున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో ఉన్న స్లమ్ ఏరియా కనబడకుండా మున్సిపల్ వర్కర్లచే కర్టెన్లు కట్టిస్తున్నారు.

'మిడ్డే'ను అక్షయ పాత్ర నుంచి వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంగశ్రీ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అక్షయపాత్ర నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అక్షయపాత్రను రద్దు చేయాలని ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన సోమవారం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. సదస్సుకు యూనియన్ జిల్లా నాయకులు జి.మంగశ్రీ, భవానీ, పి.రమణమ్మ, వెంకీయమ్మ, వెంకటలక్ష్మి, కన్నతల్లి, గౌరి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ వండి, సరఫరా చేయమని ఇచ్చిన ఆదేశాలను అక్షయపాత్ర సంస్థవారు అమలు చేయటం లేదన్నారు. అక్షయపాత్ర వున్న చోట మధ్యాహ్న భోజన పథకం కార్మికులే రాగిజావ వండుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పాత్రలు, గ్యాస్ సరఫరా కూడా చేయకుండా రాగిజావను వండించడం సరికాదన్నారు. జగనన్న గోరుముద్ద క్రింద ఇచ్చిన మెనూ చార్జీలు పెంచాలని కోరారు. పాఠశాలలో నియమించిన పారిశుధ్య కార్మికులకు రూ.6 వేలు, వాచ్‌మ్యాన్‌లకు రూ.6 వేలు వేతనం ప్రకటించారని, వాలంటీర్లలకు రూ.5 వేలు ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు వేడివేడిగా వండిపెట్టే కార్మికులకు మాత్రం రూ.3 వేలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్యాస్ ధర విపరీతంగా పెరగడం, సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలని డిమాండ్‌చేశారు. శనివారం రాగిజావ, చక్కెర పొంగలి, పప్పుచారు, ఆకుకూర అన్నంగా ఉన్న మెనూ మార్చి పని భారం తగ్గించాలని

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రైతు బజార్లలో సేంద్రీయ దుకాణాలు

రైతులకు సరిపడా స్టాల్స్ లేకపోవడంతో 13 రైతు బజార్లలోని 1286 స్టాల్స్‌లో 226 కమర్షియల్, 197 ఫార్మర్ కమర్షియల్ స్టాల్స్‌కుపోనూ మిగిలిన 881 స్టాల్స్‌ను 1823 మంది రైతులకు సర్దుబాటుచేస్తున్నారు.

13 రైతు బజార్ల నుంచి అద్దె కింద వస్తున్న రూ.33.11లక్షల్లో దాదాపు రూ.11 లక్షలు నిర్వహణ కింద ఖర్చవుతోంది. మిగిలిన రూ.22.11 లక్షలతో రైతుల అవసరాలకు సరిపడా స్టాల్స్ ఏర్పాటుచేస్తే వినియోగదారులకు రైతు బజార్లు మరింత అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం అందుకు భిన్నంగా ప్రయివేటు వ్యక్తులకు రైతు బజార్లలో చోటు కల్పించి, రైతులను దూరంచేస్తోంది. సీతమ్మధార రైతు బజార్‌లో ఏర్పాటుచేసిన సేంద్రీయ దుకాణం నుంచి రూ.15వేలు, మార్కెటింగ్‌శాఖకు చెందిన గదిలో ఏర్పాటుచేసిన గానుగుకు నాలుగువేల రూపాయలు వెరసి రూ.19వేలు, ఎంవిపి రైతు బజార్ ఆవరణలో ఏర్పాటుచేసిన షాపు నుంచి రూ.19వేలు, గోపాలపట్నం, కంచరపాలెం రైతు బజార్లలోని షాపుల నుంచి నాలుగువేల రూపాయల చొప్పున ఉన్నతాధికారులు అద్దె నిర్ణయించారు.

'మిడ్డే'ను అక్షయపాత్ర నుంచి వెనక్కి తీసుకోవాలి

కోరారు. కనీసవేతనం రూ.26 వేలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని కోరుతూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులంతా బయలుదేరాలని పిలుపునిచ్చారు.

ఎయు బస్‌స్టాప్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జి-20 సదస్సు నేపథ్యంలో నగరంలో సుందరీకరణలో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ ఇన్ గేటు వద్ద రూ.19 లక్షల వ్యయంతో ఆధునీకరించిన బస్ స్టాప్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, సిడిఎంఎ ప్రవీణ్ కుమార్, కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకట కుమారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌తో కొరియా ప్రతినిధుల భేటీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ నేతృత్వంలో కొరియా అధికారులు ప్రతినిధి బృందం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సోమవారం సర్క్యూట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుంది. విశాఖపట్నంలో ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటులో ఏ విధంగా సహకారాన్ని అందిస్తారన్న అంశంపై చర్చించామని అమర్‌నాథ్ తెలిపారు.

క్రికెట్ టీమ్‌ను సత్కరించిన డిఆర్‌ఎం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు డివిజన్ క్రికెట్ జట్టు వివిధ ఫార్మాట్లలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించడంతో జట్టును డిఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్లు బి.అవినాష్, ప్రధాన కార్యదర్శి శ్రీరెడ్డి శ్రీనివాస్, టీమ్ కెప్టెన్ ఎంఎస్ దీపక్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గంజాయి ప్రదేశ్‌గా ఎపి : వంగలపూడి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ గంజాయి ప్రదేశ్‌గా మారిపోయిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత ఆరోపించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అసమర్థ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని గంజాయి, హత్య, అత్యాచార ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2.6 లక్షల కిలోల గంజాయి పట్టుకున్నారంటే, గంజాయి ఎంత విచ్చలవిడిగా రవాణా జరుగుతుందో అర్థమౌతుందన్నారు. స్కూల్, కాలేజీ చదువుతున్న అమ్మాయిల చేతుల్లో గంజాయి దొరుకుతుందని, చివరికి పవిత్రమైన తిరుమలలో కూడా గంజాయి దొరుకుతున్న దౌర్భాగ్య స్థితి రాష్ట్రంలో ఉందని ఎద్దేవా చేశారు. వైసిపి నాయకుల మద్దతుతో వచ్చిన టిటిడి ఉద్యోగులు మద్యం తాగుతూ దొరికారని, రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా, గంజాయి ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడానికి సిఎం జగన్ ఒక్క ఛాన్స్ అడిగారా అంటూ నిలదీశారు. నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసిన వైసిపి, రఘు రామరాజును ఎందుకు సస్పెండ్ చెయ్యలేదని ప్రశ్నించారు. వైసిపిపై ప్రజా వ్యతిరేకత వచ్చిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

తిరుమలలో గంజాయి దొరకడం దారుణం : పల్లా

హిందువులు పవిత్రంగా భావించే తిరుమలలో గంజాయి దొరకడం దారుణమని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎం జగన్మోహన్‌రెడ్డి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్టులకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జిల్లాలో ఏప్రిల్ 1, 2 తేదీల్లో జరగనున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కంబైన్డ్ రిక్రూట్ మెంట్ టెస్టులకు (ఆర్‌టి–2 నుంచి 5) ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు.కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కంబైన్డ్ రిక్రూట్ మెంట్ టెస్టుల నిర్వహణపై సంబంధిత అధికారులతో డిఆర్ఓ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంబైన్డ్ రిక్రూట్ మెంట్ టెస్టులకు సంబంధించిన మెటీరియల్ ఆదివారం ప్రధాన కార్యాయానికి చేరిందన్నారు. రెండు రోజులు పాటు ఈ పరీక్షలు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎవిఎన్.కళాశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. మెటీరియల్ అదేరోజున ఉదయం 7 గంటలకు పరీక్షా కేంద్రాలకు పంపనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు అనుమతించబడవని పేర్కొన్నారు. సీల్ చేయబడిన జవాబు పత్రాలను ఎప్పటికప్పుడు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించేలా చర్యలు తీసుకోవాలని తపాలా శాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎవిఎన్.కళాశాలల అధ్యాపకులు డాక్టర్ ఎస్.శోభారాణి, ఎస్‌హెచ్‌ఎం.సింహాద్రినాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.వెంకటరావు, తపాలా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, జివిఎంసిల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీతమ్మధార స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన 4 ద్విచక్ర వాహనాలకు ఈ నెల 28వ తేదీ ఉదయం 10:30 గంటలకు వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరావు తెలిపారు. ఆసక్తి గల వారు దరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలం పాట పాడిన సొమ్ముపై 18 శాతం జిఎస్‌టి కలిపి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

జాతీయ సదస్సుకు నరవ ప్రకాశరావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విద్యా హక్కు చట్టం 2010 అమలులోకి వచ్చి 13 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న పీపుల్స్ అలయన్స్ ఫర్ ఫండమెంటల్ రైట్ టు ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యాన ఏప్రిల్ 1, 2 తేదీలలో బెంగళూరులో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ జాతీయ సదస్సులో పాల్గొనాలని నరవ ప్రకాశరావుకు పిలుపు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొననున్న నరవ ప్రకాశరావు రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం అమలు తీరు గురించి వైట్ పేపర్ సమర్పిస్తారు.

పోలవరం ఎత్తు తగ్గింపు అన్యాయం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం ఎపికి అన్యాయం చేస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రితో సహ రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకులంతా దీనిపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా నిర్మాణాన్ని పూర్తి చేయాలని, నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్మాణ ఎత్తును కుదిస్తూ కేంద్ర మంత్రి ప్రకటన చేస్తే రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసిపి ఎంపీలు నోరు ఎత్తకపోవడం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు, జి.రాంబాబు, సిఎస్.క్షేత్రపాల్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల ప్రోత్సాహానికి 'నిర్మాణ్ ఉత్సవ్'



మాట్లాడుతున్న స్టీల్ సెక్యూరిటీస్ ఎండీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి -మధురవాడ : సివిల్ ఇంజనీరింగ్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులపై అవగాహన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'నిర్మాణ్ ఉత్సవ్' పేరిట యువజనోత్సవాన్ని స్టీల్‌సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆర్య సోమవారం ప్రారంభించారు.. నగరంలోని వివిధ కళాశాలల నుంచి పెద్ద ఎత్తున సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతం క్యాంపస్ లైఫ్ ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమరావు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్న నేపథ్యంలో సివిల్ ఇంజనీరింగ్ నిపుణులకు డిమాండ్ ఏర్పడుతోందన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీర్లు ఉసరికొత్త ఆలోచనల ద్వారా ఎదగాలని పిలుపునిచ్చారు. గీతం విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ కెవిజిడి. బాలాజీ, విభాగం అధిపతి డాక్టర్ డి. ముకుంద్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు వంతెనల నిర్మాణంలో పాటించాల్సిన మెలకువలు, భవన నమూనాల తయారీ, సివిల్ ఇంజనీరింగ్‌పై క్విజ్ పోటీలు, వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



చిప్పాడలో క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్షయవ్యాధి నివారణపై సోమవారం మండలంలోని చిప్పాడలో క్షయవ్యాధి నివారణ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేఖ అప్పారావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎన్‌వి రమణ, సిబ్బంది చక్రవర్తి, శ్రీను, గ్రామ సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆశా కార్యకర్తలు జి సన్యాసమ్మ, ఆర్ దేవి పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం

సిపిఎం ఆధ్వర్యాన జోనల్ కార్యాలయం వద్ద ధర్నా



ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు, కాలనీవాసులు

ప్రజాశక్తి-వేపగుంట : జోన్ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో జివిఎంసి యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోందని సిపిఎం ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్ మాట్లాడుతూ వీరనగర్, బంటకాలనీ, అప్పలనరసయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటి పన్ను ఠంచనుగా వసూలు చేస్తున్న జివిఎంసి యంత్రాంగం, ఆయా కాలనీల్లో ప్రజలకు సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. ప్రజల కట్టిన పన్నులను స్మార్ట్‌సిటీకి మళ్లిస్తూ కాలనీల్లో సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఎమ్మెల్యే ఇంటివద్ద జోనల్ కార్యాలయం వద్ద నివాసాలు ఏర్పరచుకుని నిరసన చేయక తప్పదని హెచ్చరించారు. సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ దశాబ్దాలుగా కాలనీల్లో సౌకర్యాల కల్పనకు ఎందుకు శ్రద్ధ చూపడం లేదో ప్రజలకు ఎమ్మెల్యే, అధికారులు సమాధానం చెప్పాలన్నారు.ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం చేసి, ప్రభుత్వంపై తిరగబడే రోజులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు లక్ష్మి, సిఐటియు నేత శంకరరావు, ఎస్.శంకరరావు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో యువతకు బంగారు భవిత

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అత్యంత పోటీ ప్రపంచం యువతను ఆహ్వానం పలుకుతోందని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఎయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఇసిఇ విభాగ దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటితరం డిగ్రీలతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంత శక్తి విద్యార్థుల సొంతమని, మస్తిష్కంలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో చూపాలన్నారు. భవిష్యత్ నాయకులుగా నేటితరం యువతను మలచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత విస్ఫోటనం సవాళ్లను విసురుతోందని, వీటికి పరిష్కారాలు చూపే సామర్థ్యాలను యువత కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్ జీవితానికి అవసరమైన జ్ఞానాన్ని నైపుణ్యాలను విద్యార్థులకు అందించే దిశగా ఆచార్యులు కృషి చేయాలని సూచించారు. ఆచార్యులు ఆత్మావలోకనం చేసుకుంటూ అసాధారణ పనితీరు, ప్రగతిని చూపాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ రంగాలు సమాజంపై అత్యంత ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ రంగంలో ఇసిఇ విద్యార్థులు అడుగిడాలన్నారు. ఎయు పూర్వ విసి జివిఎస్ఎన్‌రాజు మాట్లాడుతూ స్టార్టప్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రంగాలలో ఎయు సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమన్నారు. జివిపి కళాశాల డీన్ ఆచార్య కె.రాజారాజేశ్వరి మాట్లాడుతూ నూతన కోర్సులను ప్రారంభించి, సమర్థవంతంగా నిర్వహిస్తూ జాతీయ స్థాయిలో ఎయు మంచి గుర్తింపును సంపాదించుకుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్ కుమార్, అనిట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీరామకృష్ణ, డాక్టర్ అనూరాధ, అరుణ, పివి శ్రీదేవి, కె.రమాసుధ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారంపై ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని లోడగలవానిపాలెం అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు మాజీ సర్పంచ్ లోడగల రమణ పాల్గొని పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పివివి రత్నం మాట్లాడుతూ బలమైన ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు ప్రభుత్వపరంగా అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రూ.18 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట జాతీయ రహదారిపై ఈనెల 26న బియ్యం బస్తాల లారీలో రూ.18 లక్షల విలువైన 890 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రవికుమార్ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... ముందు పోలీసులు సమాచారం మేరకు నర్సీపట్నం వైపు నుండి అనకాపల్లి వైపు వస్తున్న లారీని కశింకోట జంక్షన్‌లో యస్ఐ ఆదినారాయణ రెడ్డి తన సిబ్బందితో తనిఖీ చేశారు. బియ్యం బస్తాలులో గంజాయి ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తున్న 30 బస్తాలతో ఉన్న 890 కేజీని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ హరిదీప్‌సింగ్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గుప్త అనే వ్యక్తి కొనుగోలు చేసి వివిధ రాష్ట్రాలకు పంపుతున్నారని తేలింది. అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో యస్ఐ ఆదినారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు హరిదీప్ సింగ్‌ను కోర్టుకు తరలించారు.

నిరుద్యోగులకు టోకరా!

ఉద్యోగాలిప్పిస్తామని గ్రాండ్ వరల్డ్ మోసం

60మంది నుంచి దాదాపు అరకోటి వసూలు

ప్రజాశక్తి -గాజువాక : దుబాయిలో ఉద్యోగాలిస్తామని నమ్మబలికి నిరుద్యోగుల నుంచి దాదాపు అరకోటి వరకు వసూలు చేసిన ప్రైవేటు ఇనిస్టిట్యూట్ బాగోతమిది. డబ్బులిచ్చి ఏడాదైనా ఉద్యోగం ఊసెత్తకపోవడంతో నిరుద్యోగులంతా నిలదీసేందుకు సిద్ధపడగా, ఇనిస్టిట్యూట్ యజమాని పత్తా లేకపోవడంతో బాధితులంతా ధర్నా చేపట్టారు. వివరాలివి. గాజువాక ఆటోనగర్‌లో గ్రాండ్ వరల్డ్ వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లో నిరుద్యోగులకు శిక్షణనిచ్చి, దుబాయ్ పంపిస్తామని నమ్మబలకడంతో దాదాపు 60 మంది ఇనిస్టిట్యూట్‌లో చేరారు. ఒక్కొక్కరి నుంచి రూ.60 వేలు నుంచి రూ.80వేలు వరకు వసూలు చేసిన ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు, ఏడాదైనా దుబాయ్ పంపించక, ఉద్యోగాలిప్పించకపోవడంతో బాధితులంతా ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడిని కొన్నాళ్లుగా అడుగుతూ వస్తున్నారు. తాము వడ్డీలకు అప్పులు చేసి డబ్బులు చెల్లించామని, ఎప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో అప్పు, వడ్డీ కట్టాలన్న ఒత్తిళ్లతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సోమవారం దీనిపై తాడోపేడో తేల్చుకోవాలని బాధితులంతా నిర్ణయించుకుని ఇనిస్టిట్యూట్ దగ్గరకు వెళ్లేసరికి సంబంధిత ప్రతినిధి లేకపోవడంతో అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇనిస్టిట్యూట్ వద్దే వేచియున్నారు. కాగా దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేనట్లు తెలుస్తోంది.

ఆశీలు వేలంపాట వాయిదా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ఆశీలు వేలం పాట వాయిదా వేస్తున్నట్లు గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సేవా గరిడీలతో అప్పన్న సన్నిధికి..

ప్రజాశక్తి- సింహాచలం: విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి గణబాబు ఏటా మాదిరిగానే సోమవారం తన స్వగృహం నుంచి సాంప్రదాయ సేవా, గరిడీలు కోలాటాల నడుమ భారీ అనుచరు గణంతో కాలినడకన సింహాచలం చేరుకొని, తొలి పావంచా వద్ద సింహాద్రి అప్పన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మెట్ల మార్గంలో స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గణబాబుకు సింహాచలంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, కన్నా శ్రీనివాసరావు స్థానిక టిడిపి నాయకులు స్వాగతం పలికారు.. సింహాద్రి అప్పన్నను దక్షిణ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వీరికి స్థానిక కార్పొరేటర్లు పివి. నరసింహం రాపర్తి కన్నా బల్ల శ్రీను స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా పోలమాంబ జాతర రాట

ప్రజాశక్తి - ఆరిలోవ :9వ వార్డు పెదగదిలి సంజయ్‌గాంధీ కాలనీలో కొలువైన పోలమాంబ పంచ రాత్రి జాతరకు సోమవారం ఆలయ ధర్మకర్త కంచుమర్తి నాగరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు తేజ శర్మ పర్యవేక్షణలో పండగ రాట వేశారు. విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, తూర్పు వైసిపి నేత అక్కరమాని వెంకటరావు, వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్నం, స్వాతి దాస్ పాల్గొన్నారు.

బాదంగీర్ సాయికి 'సంగమం' ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : హైదరాబాద్‌కు చెందిన సంగమం సంస్థ పాఠికేళ్ల ప్రస్థానంలో భాగంగా నిర్వహించిన శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని బాదంగీర్ సాయి అలియాస్ ఎవివిఎస్.మూర్తికి అందించింది. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ సెంట్రల్ కోర్టు ప్రాంగణంలో ఉగాది అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బాదంగీర్ సాయికి సంగమం సంస్థ అధినేత సంజయ్ కిశోర్ ఆయనకు పురస్కారాన్ని అందజేసారు.

రైల్వే స్టేషన్లను సందర్శించిన ప్రయాణికుల సౌకర్యాల కమిటీ

ప్రజాశక్తి ఎంవిపి కాలనీ : రైల్వే బోర్డు నుంచి 5 గురు సభ్యులతో కూడిన ప్రయాణికుల సౌకర్యాల కమిటీ ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు వాల్తేరు డివిజన్‌లోని వివిధ రైల్వే స్టేషన్‌లను తనిఖీ చేయడానికి విశాఖపట్నం చేరుకుంది. ఈ పీఏసీ కమిటీ ఇప్పటివరకు సింహాచలం స్టేషన్, కొత్తవలస, బొర్రగుహలు, శిమిలిగూడ, అరకు స్టేషన్లను తనిఖీ చేసింది. ఈ కమిటీ సభ్యులుగా దిలీప్ కుమార్ మల్లిక్, అభిజిత్ దాస్, నిర్మలా కిషోర్ బొల్లిన, గొట్టాల ఉమా రాణి, డాక్టర్ జివి మంజునాథ ఉన్నారు. తాగునీటి సౌకర్యాల లభ్యత, వెయిటింగ్ హాల్, టాయిలెట్, ప్లాట్‌ఫాం షెల్టర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్రయాణికులకు కూర్చునే ఏర్పాట్లు, క్యాటరింగ్ స్టాల్స్ వంటి ప్రాథమిక సౌకర్యాలపై సభ్యులు తనిఖీ చేస్తున్నారు.

వైసిపి కార్యాలయ పనులు ఆపాలి

గిరిజన సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాదేరు:మండలంలోని చింతలవీధి పంచాయతీ నడింవీది గ్రామంలో వైసిపి కార్యాలయ నిర్మాణ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం సంఘటనా స్థలం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, 2 ఎకరాల రైతుల సాగు భూమిని ఆ పార్టీకి చట్ట విరుద్ధంగా కేటాయించారని, దీని అనుమతులను రద్దు చేయాలన్నారు.

రూ.మూడు వేల కోట్ల భారీ భూకుంభకోణం

ప్రజాశక్తి- సీతమ్మధార :విశాఖ నగరం నడిబొడ్డున రూ.మూడు వేల కోట్ల విలువచేసే భారీ కుంభకోణానికి వైసిపి ప్రభుత్వం తెరలేపిందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. క్రైస్తవ మత సంస్థకు బ్రిటిష్ ప్రభుత్వం కానుకగా ఇచ్చిన సిరిపురంలోని అత్యంత విలువైన సిబిసిఎన్‌సి భూములను విశాఖ ఎంపీ సత్యనారాయణ బృందానికి నిబంధనలకు విరుద్ధంగా వైసిపి ప్రభుత్వం కట్టబెట్టేసిందని మండిపడ్డారు. పట్టణ ప్రజలతోపాటు అధికార గణమంతా జి20 సదస్సుపై దృష్టి కేంద్రీకరించిన సమయంలో చకచకా ఫైళ్లను కదిపేసి, శంకుస్థాపనలు కూడా చేసేశారని ఆరోపించారు.సోమవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ క్రైస్తవ సంస్థల మధ్య విభేదాలు, కేసులు ఉన్న భూమిని, అవేవీ లెక్క చేయకుండా పాలక పక్ష పెద్దలు, జివిఎంసి అధికారుల ద్వారా వాయు వేగంతో ఫైలు కదిలించి, రూ. 63 కోట్లకు టిడిఆర్ కూడా ఇచ్చేశారన్నారు. కింది స్థాయి ప్లానింగ్ అధికారులను విచారణ వేసినా పట్టించుకోకుండా వారంరోజుల వ్యవధిలో ఫైళ్లను ఆమోదించేందుకు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌కు పంపడం, ఈ ఫైల్ ఆమోదం కాకుండానే ఆదివారం హడావిడిగా శంకుస్థాపన చేయడం దుర్మార్గమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టిడిఆర్ మంజూరు చేయటం, పక్కనే ఉన్న మూడు వేల గజాల సాంఘిక సంక్షేమ శాఖ స్థలాన్ని ఆక్రమించడం, మైనింగ్ శాఖ అధికారులకు తెలియజేయకుండా, వారి అనుమతులేవీ లేకుండా మైనింగ్ చేయటం, రహదారి లేకుండానే రహదారి ఉన్నట్టు చూపించి ప్లాన్ సమర్పించడం, వీటన్నిటికీ మించి ఆ భూమిపై హక్కు ఎలా వచ్చిందో తెలియజేయకపోవడం వంటి ఎన్నో అభ్యంతరాలు, సందేహాలు నివృత్తి కాకుండానే పనులు ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించారు.

వైద్య సౌకర్యాలకు రూ.50లక్షల వితరణ



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న గంగవరం పోర్టు ప్రతినిధి

ప్రజాశక్తి- గాజువాక : మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కమ్యూనిటీ హెల్త్ కేర్ సౌకర్యాల అభివృద్ధికి అదానీ గంగవరం పోర్టు రూ.50లక్షల వితరణ చెక్కును సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జుననకు పోర్టు ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు ప్రతినిధి మాట్లాడుతూ, వైజాగ్ ప్రజలకు సేవ చేసేందుకు, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కమ్యూనిటీ హెల్త్‌కేర్ సేవలకు పోర్టు సిఎస్ఆర్ నిధుల నుంచి వితరణను అందజేశామన్నారు. ఇప్పటికే అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన ఓడరేవు చుట్టుపక్కల గ్రామాలలో వైద్య శిబిరాల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిర్వహించింది, ప్రభుత్వ పాఠశాలలత విద్యార్థుల కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

774వ రోజుకు ఉక్కు దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న ఉక్కు ఉద్యోగులు

ప్రజాశక్తి-ఉక్కునగరం :విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 774 రోజు చేరుకున్నాయి. దీక్షలలో ఎల్ఎంఎం ఎస్‌బిఎం విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు రామకృష్ణ, ఎన్ రామారావు మాట్లాడుతూ, ఏప్రిల్ 5న చలో ఢిల్లీ నిరసన ప్రదర్శనకు ఇప్పటికే కొంతమంది పోరాట కమిటీ నాయకులు ఢిల్లీ చేరుకున్నారని తెలిపారు. కార్మికులు కర్షకులు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకొని ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగంపై కేంద్రం చేస్తున్న దాడిని తిప్పి కొట్టేందుకు ఐక్య ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. . పోరాట కమిటీకి మద్దతుగా నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున కలిసిరావాలని కోరారు.

అంతర వైద్య కళాశాలల క్రికెట్ పోటీల్లో
ఎన్ఆర్ఐ జట్టు ప్రతిభ



క్రికెట్ జట్టు సభ్యులను అభినందిస్తున్న కళాశాల సిఇఒ తదితరులు

ప్రజాశక్తి- తగరపువలస : డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు తిరుపతి, శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల ఆవరణలో నిర్వహించిన అంతర్ కళాశాల పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌లో సంగివలస ఎన్ఆర్ఐ వైద్య కళాశాల జట్టు మూడో స్థానంలో నిలిచిందని కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రాధామాధవ్ త్రిపాఠి తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలోజట్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సిఇఒ నిరంజన్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, ఎఒ శివప్రసాద్, హెచ్ఆర్ శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్లు గున్నాజీ, వేణుగోపాల్ తది పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలుకు కార్మికుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక: వడ్లపూడి రైల్వే వ్యాగన్ రిపేర్ కంపెనీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆటోనగర్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎం రాంబాబు విమర్శించారు. సోమవారం కంపెనీ ఎదుట కార్మికులతో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి రాంబాబు మాట్లాడుతూ రైల్వే వ్యాగన్ రిపేర్ కంపెనీలో దాదాపు 200 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కంపెనీ యాజమాన్యంగానీ, కాంట్రాక్టర్లు గానీ కార్మికులకు కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, భద్రతా చర్యలు వంటివి చేపట్టడం లేదన్నారు. స్కిల్ వర్కర్స్‌కు సైతం ఇదే పరిస్థితి ఉందని, ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేయడం, పని నుంచి తొలగించడం వంటి కక్షపూరిత చర్యలకు నిర్లక్ష్యంగా పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏదైనా ప్రమాదం జరిగితే వైద్యసదుపాయాలుగానీ, ఎటువంటి మెడికల్ బెనిఫిట్స్, పరిహారం చెల్లింపువంటివి చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్లు స్పందించి కార్మికులకు సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో ఆటోనగర్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు కార్యదర్శి ఎ.లోకేష్, కంపెనీ వర్కర్స్ అవతారం, గోపి, మహేష్, నానాజీ పాల్గొన్నారు.

కార్మికుల మనో వికాసానికి సిడబ్ల్యూసిలు



మాట్లాడుతున్న సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి

ప్రజాశక్తి -గాజువాక : కార్మికులు మానసిక వికాసానికి సిడబ్ల్యుసిలు దోహదపడతాయని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. సోమవారం అగనంపూడి సిడబ్ల్యూసిలో గుర్తింపు యూనియన్‌గా సిఐటియు హయాంలో నియమించిన సిడబ్ల్యూసి కమిటీకి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో రామస్వామి మాట్లాడుతూ, ఉక్కు. కార్మికుల ప్రయోజనానికి సిడబ్ల్యుసిలను ఏర్పాటు చేశారని, వీటికి ఉక్కు యాజమాన్యం గతంలో ఇచ్చిన నిధులను నిలిపేయడం విచారకరమన్నారు. సిడబ్ల్యూసి కమిటీ అధ్యక్షులు, డిజిఎం ఎం.జయరాజు మాట్లాడుతూ సిడబ్ల్యూసి కమిటీలు కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల నిర్వహణకు కృషి చేశాయన్నారు. స్టీల్‌ప్లాంట్ సిఎస్ఆర్ నిధులతో నిరుద్యోగులకు డ్రైవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి శిక్షణలిచ్చారన్నారు. ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సిడబ్ల్యూసి సెక్రెటరీ వంకర రాము, స్థానిక అఖిలపక్ష యూనియన్ నాయకులతో కమిటీతో సమన్వయంగా నాలుగేళ్ళఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అనంతరం సిడబ్ల్యూసి పూర్వ కమిటీ పాలకవర్గాన్ని సిఐటియు ప్రధాన కార్యదర్శి, అఖిలపక్ష నాయకులు ఘనంగా సన్మానించారు. సిడబ్ల్యూసి మాజీ కార్యదర్శి వంకర రాము అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ మాజీ ప్రెసిడెంట్ పి.కృష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ గుడే సుశీల గజేంద్ర, అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పెద్దిరెడ్డి నీలకంఠం, కరణం సత్యారావు, గంతకూర అప్పారావు, మడుగుల నర్సింగరావు, నూతన సిడబ్ల్యూసి కార్యదర్శి కరణం పైడిరాజు, పాత సిడబ్ల్యూసి కోశాధికారి శిరంశెట్టి శ్రీనివాసరావు, కార్మిక నేతలు హనుమంత శ్రీనివాసరావు, శిరంశెట్టి గోవిందరావు, ఉరిటి మరిడయ్య, డొక్కా రమేష్ పాల్గొన్నారు.

శిష్టకరణాల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని హెచ్‌బి కాలనీ మయూరి ఫంక్షన్ హాల్‌లో సీతమ్మధార శిష్టకరణం అసోసియేషన్ ఉగాది సంబరాలు నిర్వహించారు. ఁ సంఘ ప్రధాన కార్యదర్శి సాలూరు మోహనరావు ఆధ్వర్యంలో తుంబలి ప్రసాదరావు అధ్యక్షతన గాయత్రి శర్మ పంతులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అల్లిన రమేష్ కుమార్, మాధవరావు, సన్ మూర్తి, ప్రభాకరదాస్, బలివాడ హరిబాబు, హెచ్‌డివి. ప్రసాద్ పాల్గొని, 2023లో చేపట్టే కార్యక్రమాలు, అసోసియేషన్ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎన్‌డివి. ప్రసాదరావు, వి. మన్మధరావు, గుమ్మ గాంధీకృష్ణ , చౌదరి రమేష్, కొట్టెక్కి రమేష్, ఎంహెచ్ఎస్.వి. ప్రసాద్, రామశంకరరావు, బికె. కిషోర్, ఎస్. శ్రీనివాస్, ఆర్‌వి. రవికుమార్, కె.సూర్య ప్రకాశరావు, ఎన్ఎం. పోతురాజు, కె. శ్రీనివాసరావు. బి.సుందరేశ్వరరావు, వైఎస్. చిరంజీవి, బి. గోపీనాథ్, బి. గుణవతి, టి. జానకిదేవి, తదితరులు పాల్గొన్నారు.

మహా నగరానికి 'జి20' సొబగులు







రైల్వే స్టేషన్ రోడ్డులో గోడపై చిత్రీకరించిన మహనేతల ఫొటోలు

ప్రజాశక్తి-సీతమ్మధార: జి20 సదస్సు నేపథ్యంలో మహానగరి విశాఖ ముఖ్యకూడళ్లన్నీ విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న గోడలు అద్భుతమైన చిత్రాలతో ముచ్చటగొలిపేలా కనిపిస్తున్నాయి. రైల్వేస్టేషన్ కూడలి స్వాతంత్య్ర ఘట్టాలను వివరించేలా, సమరయోధులు ఫొటోలతో పర్యాటకులు, నగరవాసులను ఆకర్షించి, ఆనందభరితులను చేసే విధంగా తీర్చిదిద్దారు. ఇక తెలుగుతల్లి ఫ్లైఓవర్‌తోపాటు అటూఇటూగా ఉన్న రోడ్లతోపాటు తాటిచెట్లపాలేనికి వెళ్లే మార్గంలో ఇరువైపులా గోడలన్నీ జి20 దేశాల జాతీయపతాకాలు, ఇతర వివరాలను తెలియపరిచేలా అందమైన వాల్ పెయింటింగ్స్ వేశారు. మరోవైపు భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తాటిచెట్లపాలెం విఐపి రోడ్డును తీర్చిదిద్దారు. మొత్తానికి జి20 సదస్సుకు మరొక్క రోజు మాత్రమే గడువున్న నేపథ్యంలో నగరంలోని చెట్లు, పుట్టలు, గోడలు, వంతెనలు, కూడళ్ల ఇలా ఒక్కటేమిటి అన్నిచోట్లా విద్యుద్దీపపు కాంతులు కళ్ల జిగేల్‌మనిపిస్తున్నాయి.

29న జాబ్‌మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : ఉపాధి, శిక్షణ శాఖ నిర్దేశించిన నెలవారి కార్యక్రమాలలో భాగంగాకంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 29న బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లాలోని వివిధ కంపెనీలలో 580 ఖాళీల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె సుధా (టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థలో ట్రైనీ కెమిస్ట్ 250 ఉద్యోగాలు ఖాళీల భర్తీకి బిఎస్‌సి కెమిస్ట్రీ/డిప్లమో కెమికల్ అర్హత కలిగి, 27ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.19,744 జీతం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు ఉంటాయన్నారు. సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ సంస్థలో ట్రైనీ/ఆపరేటర్ ట్రైనీలుగా 300 ఖాళీల భర్తీకి ఏదైనా ఐటిఐ, డిప్లమో అర్హత కలిగిన 19 -35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.11వేలు నుంచి రూ.12వేలు వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు ఉంటాయన్నారు. మ్యాక్స్ ఫాషన్స్ సంస్థలో క్యాషియర్/సేల్స్ స్టాఫ్ ఉద్యోగాలు 30 ఖాళీల భర్తీకి ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 18-35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.12వేలు వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని, బయోడేటా సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలకు రావాలని సూచించారు.

పైడిమాంబ ఫైన్ ఆర్ట్స్ ఉగాది పురస్కారాలు



ఉగాది పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు నాగిరెడ్డి , ధర్మశ్రీ

ప్రజాశక్తి -గాజువాక. :పైడిమాంబ ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో నడుపూరు ఉక్కు కళావేదికలో ఉగాది పురస్కారాలను అందజేశారు. మునగపాక బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ, కళల్లోనే కాకుండా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి ఇటువంటి పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, డాక్టర్ హేమలత, కృష్ణవేణి, శ్రీనివాసగౌడ్, సాధూరావు పాల్గొన్నారు..

స్థలాల కేటాయింపులో అక్రమాలు

తహశీల్దార్ కార్యాలయం వద్ద నాలుగు గ్రామాల నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-పద్మనాభం : ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన నిజమైన నిర్వాసితులకు అన్యాయం చేస్తూ బినామీలకు రోడ్డు పక్కన ఇళ్లస్థలాలను ఇస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం తునివలస, నర్సాపురం, కొవ్వాడ, గంధవరం నాలుగు గ్రామాలకు చెందిన వంద మంది నిర్వాసిత రైతులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన నిర్వాసితులకు 900 గజాలు, 450గజాలు చొప్పున స్థలాలను ఇవ్వకపోగా, జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు కుటుంబసభ్యులు, కొంతమంది బినామీలకు 15మందికి రోడ్డు పక్కన విలువైన స్థలాలను ముట్టజెప్పడం దారుణమని ఆరోపించారు. రైతుల నుంచి 60 నుంచి 70 ఎకరాల భూమిని సేకరించారని, దాన్ని ఏయే అవసరాలకు వినియోగించారు? నిర్వాసితులకు బదులుగా ఇవ్వాల్సిన స్థలాల పంపిణీలో ఎందుకు జాప్యం చేస్తున్నారో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజమైన నిర్వాసిత రైతులకు అన్యాయం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.

ఆరోపణలు రుజువు చేస్తే దేనికైనా సిద్ధం : జెడ్‌పిటిసి గిరిబాబు

తన కుటుంబసభ్యులకు స్థలాలు ఇచ్చారన్న ఆరోపణలపై జెడ్‌పిటిసి గిరిబాబు స్పందిస్తూ, రాజకీయంగా తనపై బురద చల్లేందుకు నాలుగు గ్రామాల నిర్వాసితులను తప్పుదోవ పట్టించి వారితో ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. తనకు ఎవరూ బినామీలు లేరని, తాను ఎక్కడా భూమిని ఆక్రమించలేదన్నారు. నిరూపిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యుడినౌతానన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

◆ సి, డి గ్రేడ్ స్టూడెంట్స్‌పై దృష్టి
◆ శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికాబద్ధ కృషి


విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న చోడవరం ఎంఇఒ

ప్రజాశక్తి- అనకాపల్లి, చోడవరం

ప్రభుత్వ యాజమాన్యాల్లో నడిచే పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించడానికి తీసుకున్న చర్యలపై ప్రత్యేక కథనం.

అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 96 మంది ఇంగ్లీష్ మీడియం, 36 మంది తెలుగు మీడియం మొత్తం 132 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో వెనుకబడ్డ వారిని సి, డి గ్రేడ్‌లుగా విభజించి వారికి రోజువారి చాప్టర్లపై పరీక్షలు నిర్వహించారు. ఇచ్చిన హోంవర్క్‌లపై పరిశీలన, డిసిఇబి మోడల్ పేపర్లు నిర్వహించడం, సబ్జెక్టు టీచర్లతో వాటిపై విశ్లేషణ, అన్ని సబ్జెక్టుల్లో సెల్ఫ్ టెస్టులు, ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టారు. 100 రోజులు, 50 రోజుల ప్రణాళికలు అమలు చేశారు. ఒత్తిడి లేకుండా విద్యార్థులతో మెడిటేషన్ చేయించడం, సులభతరమైన టిప్స్ చెప్పడం చేశారు.

చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం 51 మంది, తెలుగు మీడియం 43 మంది మొత్తం 94 మంది ఉన్నారు. వీరిలో సి, డి కేటగిరిలో 21 మంది ఉన్నారు. వారికి ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. బీసీ బోర్డు మెటీరియల్‌తో శిక్షణ ఇస్తున్నారు. ఆరుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించి వారి చదువును పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను పరిశీలించడంతోపాటు, వారికి అందిస్తున్న బోధన పద్ధతులను పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు అదనపు సమయం కేటాయించి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

-ఎన్.శ్రీనివాసరావు, ఎంఇఒ, చోడవరం

వెనుకబడ్డ విద్యార్థుల దృష్టి



వెనుకబడ్డ విద్యార్థుల పట్ల అదనపు సమయం కేటాయించి బోధించడం జరుగుతుంది. విద్యార్థులు ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలను సులువుగా అర్థం చేసుకుంటున్నారు. మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

- జెజె.ప్రసాద్, హెచ్ఎం, చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల


గ్రేడ్‌లుగా విభజించాం



విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజించాం. సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. రోజుకు ఇద్దరు సబ్జెక్టు టీచర్లచే వెనుకబడ్డ అంశాల్లో తర్ఫీదు ఇచ్చి మెరుగుపర్చాం.

- ఎం.రామలక్ష్మి, సోషల్ టీచర్, తుమ్మపాల జెడ్‌పి హైస్కూల్

ఆదివారం ప్రత్యేక తరగతులు



పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. 50 రోజుల యాక్షన్ ప్లాన్ ఎంతో మార్గదర్శకంగా ఉంది. ఈ ఏడాది పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధనకు కృషి చేస్తున్నాం.

-టీవీ రమణ, తెలుగు టీచర్, తుమ్మపాల జెడ్‌పి హైస్కూల్

దోనర్స్ ద్వారా స్టడీ మెటీరియల్ అందించాం



విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కావలసిన సహకారాన్ని స్కూల్ కమిటీ ద్వారా అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు సదుపాయాలను కల్పించాం. దోనర్స్ ద్వారా స్టడీ మెటీరియల్ అందించాం.

-జి.శ్రీనివాసరావు, తుమ్మపాల జెడ్‌పి హైస్కూల్ కమిటీ చైర్మన్

మంచి ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం ఉంది



అన్ని సబ్జెక్టుల కంటే లెక్కల్లో కాస్త నాకు వెనుకబాటు ఉంది. మాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విడివిడిగా బోధన చేస్తుండడంతో సబ్జెక్టుపై సులువుగా అవగాహన పెంచుకోగలుగుతున్నాం. పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తామని నమ్మకం కలిగింది.

- నాగులపల్లి స్నేహలత భవాని, టెన్త్ విద్యార్థి, చోడవరం ప్రభుత్వ పాఠశాల

అర్థమయ్యేలా బోధిస్తున్నారు



తోటి విద్యార్థులతో పాటు తాము మంచి మార్కులు సాధించాలని ఉద్దేశంతో స్టడీ మెటీరియల్ అందించి, మాకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇంటి దగ్గర కూడా సమయాన్ని కేటాయించి చదువుకుంటున్నాం.

- జయవరపు దుర్గాప్రసాద్, టెన్త్ విద్యార్థి, చోడవరం ప్రభుత్వ పాఠశాల

యాక్షన్ ప్లాన్ ఉపయోగకరంగా ఉంది



సిలబస్ పూర్తయి ప్రస్తుతం రివిజన్ కూడా అయింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజులు, 50 రోజుల యాక్షన్ ప్లాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

-జి.హర్షవర్ధన్, టెన్త్ విద్యార్థి, తుమ్మపాల జెడ్‌పి హైస్కూల్

మెడిటేషన్, యోగా చేయించారు



సబ్జెక్టు వారీగా ప్రత్యేక శ్రద్ధతో విశదీకరిస్తున్నారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీనిపై మా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడి తగ్గించేందుకు మెడిటేషన్, యోగా చేయించారు.

- రాజ్య హాసిని, టెన్త్ విద్యార్థి, తుమ్మపాల జెడ్‌పి హైస్కూల్


పోస్టల్ సొసైటీ కార్యవర్గం

సొసైటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : ది అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ కార్యవర్గం సొసైటీ కార్యాలయంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. సొసైటీ సీఈవోగా ఎం.నాగేశ్వరరావు, అధ్యక్షులుగా బండారు సూకరాజు, ఉపాధ్యక్షులుగా వి.సింహాచలం, కార్యదర్శిగా వై.వీరభద్రం, కోశాధికారిగా కె.కిరణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా కె.నాగేశ్వరరావు, కెవిఎస్ గుప్తా, ఎన్ హరీష్ కుమార్, సిహెచ్ సత్యారావు, పి శ్రీనివాస్, ఎం శ్రీరామ్మూర్తి, ఎల్‌కెఎం పాత్రుడు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి జ్యోతిశ్వరరావు, ఎన్నికల అధికారి సత్యకుమార్ మాట్లాడుతూ సొసైటీ సభ్యుల అభివృద్ధి కోసం కార్యవర్గం కృషి చేయాలన్నారు. ఈ సొసైటీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని కొనియాడారు. సీఈవో ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీ ప్రారంభంలో సభ్యునికి రూ.6వేలు రుణం నుంచి నేడు రూ.10 లక్షల వరకు రుణం ఇచ్చే విధంగా సొసైటీ అభివృద్ధి చెందిందని తెలిపారు.

ఇల్లాలు బాగుంటేనే ఇల్లు అభివృద్ధి

ప్రజాశక్తి -యలమంచిలి : స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం 'మెప్మా' సంబరాలు ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ పిళ్లా రమకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ ఇల్లాలు బాగుంటేనే ఆ ఇల్లు అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మూడవ విడత ఆసరా పథకంలో 803 సంఘాల్లోని 8,165 మంది సభ్యులకు రూ.7.09 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో , డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఆసరా ప్రాజెక్టు డైరెక్టర్ సరోజిని, కమిషనర్ తోట కృష్ణవేణి, ఎంపిపి బొదెపు గోవింద్, వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, మెప్మా అధికార్లు పద్మావతి, రమాదేవి, వైసిపి నాయకులు కర్రి శివ, బొద్దపు ఎర్రయ్యదొర, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తిరుపతి ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్న వైసిపి

ప్రజాశక్తి-అనకాపల్లి : తిరుమల తిరుపతి దేవస్థానం ఔన్నత్యాన్ని వైసిపి ప్రభుత్వం మంటగలిపిందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో తిరుమలలో అనేక అపవిత్ర కార్యక్రమాలు నిర్వహించిందని, అన్యమత ప్రచారాలకు అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. మద్యం మాంసం, గంజాయి వంటి విక్రయాలపై పర్యవేక్షణ లేకపోవడంతో దోపిడీదారులకు అడ్డాగా మారిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మల్ల లోవ కష్ణ, కోట్ని రామకృష్ణ దొర పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్ర సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - యలమంచిలి

మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద బురదమాంబ హైరింగ్ సెంటర్‌కు రూ.3.92లక్షల రాయితీపై ట్రాక్టరు, రూ.70వేల రాయితీతో పవర్ టిల్లర్‌ను సోమవారం ఎమ్మెల్యే రమణమూర్తి రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులంతా సమిష్టిగా కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుంటే రాయితీపై యంత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ , ఎడిఎ రవిప్రకాష్, ఏఒ ఉమాదేవి, విఎఎ ప్రవీణ, ఏఇఒ దేవుడు, రైతులు పాల్గొన్నారు.


ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

ఫెర్రో పరిశ్రమలకు

పెంచిన విద్యుత్ ధరలు తగ్గించాలని సిఐటియు నిరసన



ఆందోళన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పరిశ్రమల ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల ఫలితంగా పరిశ్రమలు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి యూనిట్‌కు రూ.1.50 చొప్పున పెంచి సంవత్సరానికి సుమారు రూ.300 కోట్లు భారం మోపుతుందని తెలిపారు. దీని వల్ల పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందని, వేలమంది కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపనుందని చెప్పారు. కొత్త పరిశ్రమలు రప్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం, ఉన్న పరిశ్రమలను నష్టాల్లోకి నెట్టే విధానాలను అనుసరించడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా, పరిశ్రమల యజమానులు, ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమినాయుడు, నాయకులు రమణమూర్తి, సత్యవతి, వర్మ, నర్సింగరావు, ఎస్ఇజెడ్‌లోని మైతాన్, అభిజిత్, ఆర్ఎస్ఎల్, సుందరం, సన్నివేరా తదితర ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులు పాల్గొన్నారు.

ఏడుగురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని పాతవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునితో పాటు మరో ఆరుగురు ఉపాధ్యాయులకు డిప్యూటీ డిఇఒ ప్రేమ్ కుమార్ సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డిప్యూటీ డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, బృంద సభ్యులు కె.శ్రీనివాస్, వి.నూకరాజు సోమవారం ఆ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్నం భోజన పథకం, ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికలు, డైరీలు, బైజూస్, లైబ్రరీ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో షోకాజ్ నోటీసులు ఇచ్చారని ఎంఈఓ మధుమూర్తి తెలిపారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని ప్రాచీన శివాలయం పునఃనిర్మాణానికి సర్పంచ్ దెడ్డము ప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు, వైసిపి నాయకులు కోటన రాము, బోకం రాము నాయుడు, సబ్బవరపు ముత్యాల నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, కర్రి బాబు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు బుజ్జి, గొర్లి శ్రీనివాసరావు, బంతికోళ్ల పద్మ పాల్గొన్నారు.

వెంకటరాజు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఎనిమిది సంవత్సరాల క్రితం విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన వీఆర్వో పి.వెంకటరాజు సత్యనారాయణ కుటుంబాన్ని ఏపీ జేఏసీ అనకాపల్లి జిల్లా నాయకులు సింగంపల్లి వాసు, జేఏసీ సభ్యులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ చనిపోయి ఎనిమిదేళ్లు అయినా నేటికీ ఆ కుటుంబానికి చెందినవారికి కారుణ్య నియామకం చేపట్టకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే వారికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

పంట కాలువల ఆక్రమణపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ పరిధిలో ఉన్న పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయని, తక్షణమే ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టాలని సోమవారం జీవీఎంసీ కమిషనర్‌కు 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు వినతిపత్రం అందజేశారు. యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణలు తొలగించి పొలాలను ముంపు నుంచి కాపాడాలని కోరారు. ఈ ఆక్రమణల వల్ల అనకాపల్లి విలీన గ్రామాలు, అనకాపల్లి పట్టణం, మునగపాకలో సుమారు 5వేల ఎకరాలు ప్రతి సంవత్సరం ముంపునకు గురవుతున్నట్లు చెప్పారు.

డిప్యూటీ సిఎంను కలిసిన డిఇఒ

ప్రజాశక్తి-దేవరాపల్లి : నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనకాపల్లి జిల్లా విద్యాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని తారువలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జరగనున్న పరీక్షల ఏర్పాట్లపై, పాఠశాలలో నూతనంగా అమలవుతున్న రాగి జావ పంపిణీపై డీఈవోను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ప్రేమ్ కుమార్, వైసిపి టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా గంగాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం పంచాయతీ శివారు చినగొల్లలపాలెం గ్రామంలో గంగాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, చినగొల్లలపాలెం గ్రామ ప్రజలు, కడుపుట్ల వారి కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తప్పెడగుళ్లు, సాముగరిడీలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పల్లా తాతారావు, పల్లా కృష్ణ, పల్లా సన్యాసిరావు, కడుపుట్ల నాయుడు, రోమాల దేవుడు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి- చోడవరం : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్- 2023కు మండలంలోని గాంధీ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న దీపాక్షిక, లావణ్య, సత్యమాధురి, క్రిష్ణ చైతన్య ఎంపికయ్యారు. వారిని హెచ్ఎం ఎన్.శ్రీనివాస్, స్కూల్ కమిటీ ఛైర్మన్ డి.పార్వతి, వైస్ ఛైర్మన్ ఎస్.గోవింద్,ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో



ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు, స్థానికులు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ స్థానిక మెయిన్ రోడ్డుపై అఖిలపక్షాల ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మండుటెండలో చేపట్టిన ఈ కార్యక్రమానికి వాహనచోదకులు తమ మద్దతును ప్రకటించారు. వాహనాలు కిలోమీటర్ల మేర స్తంభించిపోయాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ, టిడిపి నాయకులు మొల్లేటి సత్యనారాయణ, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఎఎస్‌వి మహేష్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుండి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. ఈ ఏడాదిలో ఈ మార్గంలో ప్రమాదాలకు గురై నలుగురు మరణించారని, వందలాది మంది కాళ్ళు, చేతులు విరిగి శాశ్వత వైకల్యం చెందారని తెలిపారు. వారం రోజుల లోగా ఈ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే రోడ్డును పూర్తిగా దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు దాడి ముసలి నాయుడు, ఆడారి జగన్నాధరావు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, ఆడారి పరశురాం, వెలగా మురళి,వేగి కుమార్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం





కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు, వినతిపత్రం చూపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి

స్పందనలో వచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించి 175 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన దరఖాస్తులను తిరస్కరించినట్లయితే అందుకు గల కారణాలను దరఖాస్తుదారునికి తెలియజేప్పాలన్నారు. కార్యక్రమంలో జెసి కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు ఆలోచన విరమించాలి

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో నేడు ప్రాజెక్టు ఎత్తు తగ్గించి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే కుట్ర చేస్తోందని, తక్షణమే ఈ ఆలోచన విరమించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం పదేపదే అన్యాయం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం రాము నాయుడు, ఆర్ దొరబాబు, గురు బాబు, సుబ్బలక్ష్మి, సన్యాసిరావు, వైఎన్ భద్రం, కన్నబాబు సత్తిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులను పునర్నిర్మించాలని సిపిఎం వినతి

చోడవరం : చోడవరం రోడ్డులోని గోవాడ, వెంకన్నపాలెం వద్ద శిథిలమై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులను వెంటనే పునర్నిర్మించాలని, రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం చోడవరం మండల కమిటీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్వీ నాయుడు, బి దేవుళ్ళు పాల్గొన్నారు.

104 వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి

వి.మాడుగుల, కె.కోటపాడు, దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయించిన 104 అంబులెన్స్‌లను మండలంలోని తారువలో డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, కె.కోటపాడు, దేవరాపల్లి జెడ్‌పిటిసిలు అనురాధ, కర్రి సత్యం, కర్రి సూర్య నాయుడు, వైద్యాధికారి సుబ్రమణ్యం, రాజశేఖర్, మూర్తి, పాల్గొన్నారు.



104 వాహనాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

అనకాపల్లి : మండలంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం 104 వాహనాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సోమవారం ప్రారంభించారు. అనకాపల్లి, కశింకోట ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీపీ కలగా లక్ష్మి, జిల్లా వైద్యాధికారులు శారదాబాయి, జ్యోతి, కసింకోట పీహెచ్సీ వైద్యాధికారి తిరుపతిరావు, తాళ్లపాలెం వైద్యాధికారి రమేష్ పాల్గొన్నారు.

చోడవరం : ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం వైసిపి కార్యాలయం వద్ద 104 వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ గాడి కాసు, వైసిపి నాయకులు బొడ్డేటి సూర్యనారాయణ, నర్సింగరావు, దేవరపల్లి సత్య పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

దోషులను అరెస్టు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లికి చెందిన, జామి సింహచలంనాయుడు మృతికి కారణమైన దోషులను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన మృతుని బంధువులు, గ్రామస్తులు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీనికి ముందు రైవాడ అతిథి గృహం నుండి పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సింహాచలం నాయుడు మృతి చెంది 9 రోజులైనా ఇప్పటికీ విచారణ చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కె.కోటపాడు సిఐ తాతారావు, ఎస్ఐ ధనుంజయరావు జోక్యం చేసుకొని వెంటనే విచారణ ప్రారంభించి మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే దోషులను అరెస్టు చేయకుంటే జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, స్థానికులు గవిరెడ్డి సింహచలంనాయుడు, బండారు అప్పలనాయుడు, సిహెచ్ భవాని, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ ఈవోగా బండారి ప్రసాద్

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకంబిక అమ్మవారి ఆలయ కార్య నిర్వహణ అధికారిగా బండారి ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం మురళి నగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈవోగా ఇంతవరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన నూకాంబిక ఆలయ ఈవోగా బదిలీపై వచ్చారు. ఆయనకు ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అంద జేశారు. శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి-చోడవరం : వర్షాలకు గుంతలు పడ్డ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టే కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే సోమవారం చేపట్టారు. గాంధీ గ్రామం దగ్గర జరిగే ఈ మరమ్మతు పనులు ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డాది జంక్షన్లో రోడ్డు అస్తవ్యస్తంగా ఉండేదని, రూ.35 లక్షలతో సరి చేయడమే కాకుండా మరికొన్ని నిధులతో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. చోడవరం నుండి గంధవరం, అజ్జాపురం వరకు రోడ్డుకు రూ.112 కోట్లు మంజూరైనట్లు చెప్పారు.

మిడ్డేమీల్స్ పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని టి.సిరసపల్లి ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఎంపీడీవో రవికుమార్ సోమవారం పరిశీలించారు. భోజన ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని ఆరగించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మునగపాకలో సంపద తయారీ కేంద్రం వద్ద జరిగే ఐదు రోజుల శిక్షణ కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు దిమ్మల అప్పారావు, మద్దాల ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వికలాంగ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని సోమవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు చేతులు మీదుగా అందజేశారు. ఐదుగురు వికలాంగ విద్యార్థులకు స్క్రైబ్ అవసరం కాగా వారికి ప్రత్యేక ఉపాధ్యాయులు బి.అప్పలరాజు అన్నిరకాలుగా సదుపాయాలను సమకూర్చారని హెచ్ఎం తెలిపారు. ఒకరి విద్యార్థికి వీల్ ఛైర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.వెంకటేశ్వరరావు, వి. సతీష్, సిఆర్‌పి శ్రీను పాల్గొన్నారు.



పరీక్ష మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం తదితరులు



రోడ్డుపై పోతున్న నీరు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-గొలుగొండమండలంలోని లింగంపేట పంచాయతీ ప్రధాన రహదారి ఆనుకొని లింగంపేట నుంచి పలు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ నాలుగు రోజుల క్రితం మరమ్మత్తులకు గురైంది. దీన్ని ఎవరూ పట్టించుకోక పోవడంతో తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. అసలే వేసవి కాలం మునుముందు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి -కొత్తకోట:జాతీయ ఉపకార వేతన అర్హత (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఫలితాలలో టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డొంక సాయి లోకేష్ ఎంపిక అయ్యాడని పాఠశాల హెచ్ఎం కెఆర్ఎస్ నాయుడు తెలిపారు. ఈ పాఠశాలలో సుమారు 10మంది విద్యార్థులకు సీఆర్పీ రామారావు ఉచిత శిక్షణ ఇచ్చారన్నారు. . ఈ సందర్భంగా హెచ్ఎం కేఆర్ఎస్ నాయుడు మాట్లాడుతూ, ప్రతీ ఏటా జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్ష కోసం ఉచితంగా శిక్షణ అందించి ఎంపిక అయ్యేలా తర్ఫీధునిస్తూ పాఠశాలకి మంచి పేరు గుర్తింపు తీసుకు వస్తున్న సిఆర్‌పి గుంటూరు రామారావు సేవలు అభినందనీయమన్నారు. అర్హత సాధించిన విద్యార్థి డొంక సాయి లోకేష్ ను హెచ్ఎం, , ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ఎమ్. శివయ్య నాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



చింతపండును విక్రయిస్తున్న వ్యాపారులు

చింతపండుకు గిరాకీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండల కేడిపేటలో సోమవారం జరిగిన వారపు సంతలో చింతపండు కిలో రూ.60లకు అమ్మకాలు జరిగాయి. ఈ మేరకు వారపు సంతకు కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన పలువురు గిరిజన, మైదాన ప్రాంతాలకు చెందిన రైతులు వందల సంఖ్యలో విక్రయాలకు తీసుకువచ్చారు. ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉండటంతో చింతపండుకు గిరాకీ పెరిగింది. తెచ్చిన గంటల వ్యవధిలోనే చింతపండు అమ్ముడుపోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని రమణయ్యపేటకు చెందిన వీర్ల సురేష్ (34) విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. ఆదివారం సాయంత్రం సురేష్ ఇంటి వద్ద కొబ్బరి చెట్టు నుండి కాయలను ఇనుప చువ్వతో లాగేందుకు ప్రయత్నించగా పక్కనే ఉన్న హెచ్‌టి విద్యుత్తు లైనుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు సురేష్ ను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. వైద్యులు పరీక్షించంగా అప్పటికే సురేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఏడాది కుమారుడు ఉన్నాడు. మృతుని భార్య భవ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శిరీష వెల్లడించారు.

నెరవేరిన కళ

మండల పరిషత్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మశ్రీ



ప్రారంభిస్తున ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -కొత్తకోట:15 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న మండల పరిషత్ నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆ భవన సముదాయాన్ని సోమవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, మండల పరిషత్ భవనం చూడచక్కగా నిర్మించారని, త్వరితగతిన రెండవ ఫ్లోర్ కూడా నిర్మించాలని, శిథిలమైన పాత భవనాలను తక్షణం తొలగించి మండల పరిషత్ ఆవరణను గ్రీనరీగా మార్చాలని పిఆర్ డిఈ ప్రసాద్‌కు ఎమ్మెల్యే ఆదేశం చారు. 2008లో బస్సు యాత్రలో భాగంగా ఇక్కడికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నూతన భవన సముదాయానికి శంఖుస్థాపన చేశారన్నారు. మండల పరిషత్ గ్రాంటు నుంచైనా నూతన భవనం గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించాలని ఎమ్మెల్యే ధర్మశ్రీ సూచనల మేరకు ఎంపిపి చాంబర్, ఎంపిడివో, ఇతర అధికార్ల గదులు, విశాలమైన హాల్ నిర్మించారు. సుందరమైన టైల్స్, చక్కని రంగులు,సౌకర్యవంతమైన ఫ్యాన్.కుర్చీలు ఏర్పాటు చేయడంతో ధర్మశ్రీతో పాటు పాలకవర్గ సభ్యులు అధికార్లు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. 15 ఏళ్ల కళ నెరవేరిందన్నారు.ప్రారంబోత్సవం సందర్భం గా ధర్మశ్రీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కోలాటం ఏర్పాటు చేశారు. మద్యాహ్నం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. ఈకార్యక్రమం లో ఎంపిపి పైల రాజు, రోలుగుంట ఎంపిపి వై.శ్రీనివా సరావు, రావికమతం, జెడ్పిటిసిలు తలారి రమణమ్మ ఆదిమూర్తి, దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, డిఈ ప్రసాద్, రావికమతం, బుచ్చెయ్యపేట మండల వైఎస్ఆర్ కాంగ్రేస్ పార్టీ అద్యక్షులు ముక్కా మహలక్ష్మినాయుడు, అచ్చెం నాయుడు, రావికమతం మండల వైస్ ఎంపిపిలు దంట్ల వెంకట రమణ, మత్స భవానిప్రసాద్, ఎంపిటిసి ఫ్లోర్ లీడర్ పూడి దేవ, ఎంపిడివో వెంకన్నబాబు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబూరావు అన్నారు. సోమవారం కొరుప్రోలు సచివాలయ భవనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో గత ప్రభుత్వం హయాంలో జరగని అభివృద్ధి ప్రస్తుతం కన్పిస్తుందన్నారు. ప్రజల సమస్య సత్వర పరిష్కానికే సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. అనంతరం జగనన్న ఇళ్ళ కాలనీల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీరామచంద్రమూర్తి, ఈవోఆర్డీ జి.సత్యన్నారాయణ, కార్యదర్శి రామలక్ష్మి, ఇంఛార్జ్ సర్పంచ్ కొరపాటి గోపాలం ఎంపిటిసి వెంకటలక్ష్మి, పిఏసిఎస్ అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్రరాజు, మాజీ ఎంపిటిసి చేకూరి వరహాల రాజు, మాజీ సర్పంచ్ పుట్టా సుధాకర్ అధికారులు నాయకులు పాల్గొన్నారు.

సరుకులు, నగదు వితరణ

ప్రజాశక్తి-గొలుగొండ:జనసేన పార్టీ జనసైనికులకు నిత్యం అండగా ఉంటుందని నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. గొలుగొండ ఎస్సీ కాలనీకి చెందిన బోడపు వంశీకుమార్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో, జనసేన పార్టీ తరపున నిత్యావసరాల సరుకులతో పాటు రూ.5వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా నిలిచేది జనసేన పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, మండల సీనియర్ నాయకులు రేగుబల్లి శివ, బోయిన చిరంజీవి, వాసం వెంకటేష్, చిరంజీవి శ్రీను, ఎంపిటిసి అభ్యర్థి బోయినబాల కుమారి, నర్సీపట్నం టౌన్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి శ్రీను పాల్గొన్నారు.



సరుకులు ఇస్తున్న నేతలు

పలు చోట్ల కార్పెంటర్స్ డే



గొలుగొండలో ర్యాలీ చేపడుతున్న కార్పెంటర్స్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో సోమవారం కార్పెంటర్స్ డే కార్యక్రమాన్ని ఆ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. శ్రీకామాక్షి వీరబ్రహ్మేంద్రస్వామి వడ్రంగి పనివార్ల సంఘం ఆధ్వర్యంలో సభ్యులంతా ప్లకార్డులు చేతబట్టి స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నుండి బయలుదేరి గ్రామ శివారు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరమ్మతుకు గురైన విద్యార్థుల టేబుల్స్‌కు స్థానిక వైసీపీ నాయకుడు, నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు తన సొంత నిధులు వెచ్చించి అందించిన ప్లైవుడ్ చెక్కలను బిగించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గుమ్మాలు, తలుపులకు రిపేరు కూడా చేశారు. పాఠశాల సిబ్బంది, ఆసుపత్రి సిబ్బందితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు సంఘ సభ్యులకు కార్పెండెన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

నర్సీపట్నంరూరల్: కార్పెంటర్స్ సమస్యలు పరిష్కరించాలని కార్పెంటర్స్ డే సందర్భంగా నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ కామాక్షి వడ్రంగి పని వార్ల సంఘం ఆధర్యంలో సిబిఎం కాంపౌండ్ నుండి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు సోమవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పూడి చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ వృత్తి పని వారికి ఆర్థికపరమైన సాయం లభించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పోలుమూరి బ్రహ్మాజీ, గౌరవ అధ్యక్షులు కడియం రవికుమార్, సెక్రటరీ కొమ్ముజు శ్రీనివాసరావు, కోశాధికారి గానుగుల సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ పోలుమూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



నర్సీపట్నంలో ఆర్‌డిఒకు వినతి

అనితను కలిసిన మత్స్యకార నేతలు



అనితతో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి :తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితను సోమవారం విశాఖలో కలిసి మత్స్యకార సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్లినట్లు జాతీయ మత్సకార సంఘం జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్ స్థానిక విలేకరులకు తెలిపారు. జెట్టి నిర్మాణ సమస్యతో పాటు ,మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మత్స్యకారులకు జెట్టి నిర్మాణం పక్కగా ఏర్పాటు చెయిస్తాననీ ఆమె హామీ ఇచ్చినట్లు వెంకటేష్ తెలిపారు. అనితన కలిసిన వారిలో జాతీయ మత్స్యకార సంఘ నాయకులు పిక్కి కోదండరావు, పేర్ల శ్రీనివాస్, వాసుపల్లి శివ,సిరిపిల్లి అప్పలరాజు ఉన్నారన్నారు..

సచివాలయ సిబ్బందితో సమీక్ష



సమీక్షిస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి -నక్కపల్లి:సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు సక్రమంగా అందించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండలంలోని దేవవరం పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం, ఈ సర్వీసెస్, ఆయుష్మాన్ భారత్ కార్డ్స్, ఈకేవైసీ, ఎస్ టిజి సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఈఓపి ఆర్ డి.వెంకటనారాయణ, వైసిపి నాయకులు గొర్ల నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వీల్ ఛైర్‌ను ఇస్తున్న భవిత ఉపాధ్యాయులు

విద్యార్థినికి వీల్‌ఛైర్ అందజేత

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రపంచ డౌన్ సిండ్రోమ్ (జన్యు సంబంధమైన వ్యాధి)ను సోమవారం భవిత కార్యాలయంలో నిర్వహించారు. వెంకటాపురం హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని నాతిరెడ్డి షర్మిలకు వీల్ ఛైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు పట్నాయక్, సిఆర్పిలు నాని, రాజేష్ , సంతోష్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం:మండల కేంద్రంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండలం రామ్ చరణ్ ఫాన్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయంతో రావికమతం గర్ల్స్ హైస్కూల్ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రాంక్లు, పెన్నులు, పెన్సిల్లు ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, జిల్లా వికలాంగుల మాజీ అధ్యక్షులు గెంజి శ్రీనివాసురావు మాట్లాడుతూ,రామ్ చరణ్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన కార్యకర్తలు, రామ్ చరణ్ అభిమానులు పాల్గొన్నారు.



సామగ్రిని ఇస్తున్న నాయకులు

ఎసిబికి చిక్కిన లైన్‌మ్యాన్

ప్రజాశక్తి-మాడుగుల: వ్యవసాయ మోటార్ కనెక్షన్ కోసం లంచం డిమాండ్ చేసిన ఎం.కోడూరు విద్యుత్ లైన్‌మెన్ వి.రమేష్ సోమవారం ఏసిబి దాడిలో పట్టుబడ్డాడు. జి.అగ్రహారం గ్రామానికి చెందిన రైతు గుమ్మాల కొండలరావు వ్యవసాయ కనెక్షన్ కోసం రెండేళ్ల కిందట ధరఖాస్తు చేశాడు. అప్పట్లో రూ.45 వేల లంచం సదరు లైన్ మన్ కు ఇచ్చాడు. రెండేళ్లుగా కనెక్షన్ ఇవ్వకపోగా తిరిగి మరో 5 వేలు డిమాండ్ చేశాడు. దీంతో సదరు రైతు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.సోమవారం మధ్యాహ్నం ఘాట్ రోడ్ జంక్షన్ వద్ద నగదు తీసుకుంటున్న సమయంలో ముందుగా కాపు కాసిన ఏసిబి అధికారులు పట్టుకున్నారు. ఈ దాడిలో అడిషనల్ ఎస్‌పి షకీలా బాను, డిఎస్పీ రమణమూర్తి, సిఐలు సతీష్ కుమార్ ప్రేమ్ కుమార్, రామకృష్ణ, ఎస్సైలు మనోజ్, సురేష్ పాల్గొన్నారు.


పట్టుబడ్డ నిందితుడు



ఆర్‌డిఒను వేడుకుంటున్న మహిళ

ఇంటికి దారి కల్పించండి

ఆర్‌డిఒకు మహిళ వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : తన ఇంటికి వెళ్లే దారిని ఆక్రమించడంతో దారి లేదని గొలుగొండ మండలం పాకలపాడు గ్రామస్తురాలు బంగారు నూకాలతల్లి సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తమ ఇంటి నుండి గ్రామ కంఠం రోడ్డుకు వెళ్లే దారిని పాకలపాడు గ్రామానికి చెందిన కామిరెడ్డి అప్పలరాజు పూర్తిగా తోవను ఆక్రమించి గోడ నిర్మించాడని తెలిపింది. దీంతో ఇంట్లోంచి బయటికి రావడానికి కూడా వీలు లేకుండా పోయిందని, ఇంటి వాడుక నీరు పట్టుకెళ్లే క్రమంలోనూ అనేక ఇబ్బందులు పడుతున్నాని ఆమె విలేకరుల వద్ద గోడు విలపించుకుంది. మండల రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారుల వద్దకు అనేకమార్లు తిరిగినప్పటికీ తమకు న్యాయం జరగలేదని, ఒంటరి వితంతు మహిళ తనకు ప్రాణం భయం కలుగుతుందని ఆమె కన్నీటి పర్యంతం అయింది.



మాట్లాడుతున్న వైద్యులు

నల్ల బ్యాడ్జీలతో వైద్యులు నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేట్ ఆసుపత్రులపై పాస్ చేసిన రైట్ టు హెల్త్ బిల్ ను తక్షణమే రద్దు చేయాలంటూ నర్సీపట్నం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, మార్చి 27 బ్లాక్ డేగా పాటిస్తున్నామని అన్నారు. రైట్ టు హెల్త్ బిల్లు దారుణమని ఈ బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ కేస్ అని డాక్టర్లు నిర్ధారించాలని, వచ్చిన పేషెంట్ ఎమర్జెన్సీ అని ఎలా నిర్ధారించగలరన్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి కేసు ఎమర్జెన్సీ గానే ఉంటుందని, తక్షణమే బిల్లు రద్దు చేయకపోతే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూచనల మేరకు రాబోయే రోజుల్లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ హను తేజ్, నర్సీపట్నం సీనియర్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి


అనకాపల్లిలో శంకర్రావు ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం:

కార్మిక,కర్షకుల సమస్యలను పరిష్కరించాలని ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు అనకాపల్లి, విశాఖ జిల్లాలో ప్రచారం చేపడుతూ పోస్టర్లను ఆవిష్కరించారు.

అనకాపల్లి : బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకర్రావు పిలుపునిచ్చారు. స్థానిక జీవీఎంసీ కార్మికులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంట శ్రీరామ్, అనిల్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన గోడ పత్రికను సోమవారం పరవాడ ఫార్మసిటీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక, రైతు హక్కుల సాధనకే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే పోతి నాయుడు, పి చిన్నారావు, కేఎం నాయుడు, ఏ రాజా, కె ధారబాబు, సత్తిబాబు, పెంటారావు పాల్గొన్నారు

కె.కోటపాడు : ఏప్రిల్ ఐదో తేదీన జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మాడుగుల: కార్మిక,కర్షకుల సమస్యలను పరిష్కరించాలని ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇ.నరసింహ మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే.భవాని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సంత లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్లో 30 వేల కోట్ల కోత పెట్టిందన్నారు. 200 రోజుల పని కల్పన, కనీస వేతనం రూ.600 అందని ద్రాక్షగా మారాయని అన్నారు. మోడి విధానాలతో రైతులు ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం జరగనుందని, దీన్ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సోమల విజయ్, మాదల బాలకృష్ణ, ఈశ్వరమ్మ, లక్ష్మి ,రమణ, వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండలం కేంద్రంలో సిఐటియు మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు ఆధ్వర్యంలో గోడ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల, రైతుల, ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో విఫలం చెందిందన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే కార్మిక – కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల్ సంఘం నేతలు గణేష్, నాగరాజు, రమణ, నాగేష్, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



భీమిలిలో..

చలో ఢిల్లీకి బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల మద్దతు

కలెక్టరేట్ : ఏప్రిల్ 5న ఢిల్లీలో చేపట్టే కార్మిక, కర్షక భారీ ర్యాలీకి మద్దతుగా సోమవారం బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయం ఎదుట స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసిహెచ్‌వి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటానికి సిద్ధమవుతున్న కర్షక కార్మిక వర్గం వచ్చేనెల 5న చలో ఢిల్లీ ఆందోళన జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని స్టోర్ జంక్షన్ వద్ద చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ దేశానికి సంపద సృష్టించే ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ప్రైవేటుకు దారాదత్తం చేయడం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థను కుదేలు పరచాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు.స్టీల్ సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ పి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించే విపక్షాలపై కేంద్రం భౌతికదాడులకు పూనుకోవడం దుర్మార్గమని, ఇలాంటి చర్యలను ఐక్యపోరాటాలతో తిప్పికొట్టేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు గంగాధర్, డి కష్ణమూర్తి, కె వి.సత్యనారాయణ, యు మరిడయ్య, బిఎన్ మధుసూదన్, దేముడు నాయుడు, బి.మహేష్, కె సత్యనారాయణ, సూరిబాబు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, శంకరరావు పాల్గొన్నారు.



ఉక్కునగరంలో...

ములగాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన కార్మిక కర్షక సంఘర్ష ర్యాలీ జయప్రదం చేయాలని సిఐటియు వెంకన్న పాలెం కార్యాలయంలో సోమవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను ఆవిస్కరించారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, అధ్యక్షులు కె.పెంటారావు నాయకులు పి.పైడిరాజు, ఎం.అప్పలనాయుడు నూకరాజు కాటంరావు ఎస్ వాసు సత్యనారాయణ, ఎ.సత్యారావు, సత్యనారాయణ, త్రినాధ్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం జివిఎంసి రెండు, మూడు వార్డుల్లోని పలు ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జోన్ అధ్యక్ష ,కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, నాయకులు ఎస్ అప్పలనాయుడు, ముఠా కార్మికులు పాల్గొన్నారు


మాడుగులలో పోస్టర్ ఆవిష్కరణ

'ఆసరా'తో మహిళలకు ఆర్థిక భరోసా



చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి పాయకరావుపేట: వైసిపి పాలనలో మహిళలకు వైయస్సార్ ఆసరా లభిస్తుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ, రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం ఆసరా మూడో విడత ఆసరా జమ చేయడం జరిగిందని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 6578 పొదుపు సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా పథకం కింద 3 విడతల్లో రూ.5,306 కోట్లు మహిళలు ఖాతాలోకి జమ అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట మండల అధ్యక్షులు ఇసరపు పార్వతి తాతారావు, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, పాయకరావుపేట సర్పంచ్ గార ఉషశ్రీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, వైస్ ఎంపీపీలు దని శెట్టి మాధవి, పల్లెలు మణికంఠ స్వామి, ఉప సర్పంచ్ జిగతా భవాని శ్రీను, స్వయ సంఘాల అధికారులు మండలాధికారులు నాలుగు మండలాల ఎంపీటీసీలు, సర్పంచులు, నియోజవర్గ స్థాయిలో మహిళలు పాల్గొన్నారు.

గొలుగొండ: మహిళా పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. సోమవారం గొలుగొండలో వైయస్సార్ ఆసరా మూడో విడత చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి పథకంలో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇస్తూ మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలను ఆపకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చారన్నారు. మండలంలో ఇప్పటి వరకు 10,890 డ్వాక్రా మహిళలకు మూడు విడతలుగా రూ.22 కోట్లు ఆసరా పథకం ద్వారా పంపిణీ చేశామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 120 కోట్లు నేరుగా డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేశామన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపిపిలు జక్కు నాగమణి, సుర్ల ఆదినారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొందల రాజు, తహశీల్దార్ ఆనందరావు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, వెలుగు ఏపిఎం మంగ, పంచాయతీ కార్యదర్శులు, ఎస్సై నారాయణరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.